www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 జనవరి 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



దాడికి పాల్పడిన వారిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ మరియు సచివాలయ సిబ్బందిపై దాడి చేసిన వారిని చర్యలు తీసుకోవాలంటూ ఎంపీడీవో నాతి బుజ్జికి మండలంలోని 17 గ్రామాల సచివాలయం సిబ్బంది బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం ఆత్రేయపురం చిన్న పేటలో విధి నిర్వహణలో భాగంగా డ్రైనేజీని శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది సత్యనారాయణ సచివాలయ సిబ్బంది చింత సాయిలపై దాడి చేసి గాయపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని వారు పేర్కొన్నారు.


ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయల సిబ్బంది

దద్దరిల్లిన కలెక్టరేట్

- బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరు
- ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు
- అంగన్‌వాడీల ధర్నాలో నేతల హెచ్చరిక

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి కలెక్టరేట్ వద్దకు చేరుకుని అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె చేయడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. సమ్మె అనంతరం పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్ వాడీల పోరాటానికి ప్రజాసంఘాలుగా మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, అంగన్‌వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ తక్షణం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వం అంగన్‌వాడీలు ఈనెల 5న విధుల్లో చేరకపోతే చర్యలు తప్పవని ఇచ్చిన సర్క్యులర్ కాపీలను కలెక్టరేట్ ఎదుట దహనం చేశారు. అంగన్‌వాడీలు రోడ్లపై ధర్నా చేసి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె విరమించేది లేదన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలు ఉద్యమ పాటలు ఆలపిస్తూ నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎఒ దుర్గాప్రసాద్‌కు తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతి పత్రం అందజేశారు. టిడిపి నాయకులు మాజీ ఎంఎల్‌ఎఅయితా బత్తుల ఆనందరావు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, నూకల బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, యుటిఎఫ్, సర్వ శిక్ష అభి యాన్, బిల్డింగ్ వర్కర్ల యూనియన్, పంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకులు, అంగన్‌వాడీ నాయకులు బేబీ గంగారత్నం, దుర్గమ్మ, విజయలక్ష్మి, పి..వెంకటలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, సుజాత,రాణి, అమూల్య తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** కలెక్టరేట్ వద్ద మహాధర్నాకు ముమ్మిడివరం ప్రాజెక్ట్ అంగన్ వాడి లు భారీగా తరలి వెళ్ళారు. సమ్మె లో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అధ్యక్ష కార్యదర్శులు దుర్గా మల్లేశ్వరీ, జయలక్ష్మి అద్వర్యంలో 23వ రోజైన బుధవారం సమ్మె శిబిరం వద్ద కు చేరిన అంగన్‌వాడీలు సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ సారథ్యంలో అమలాపురం కలెక్టరేట్ కార్యాలయానికి భారీగా తరలి వెళ్ళి సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమానికి సుబ్బలక్ష్మి, హైమావతి , టి.శ్రీదేవి, తలుపులమ్మ, జి.మంగాయమ్మ, విజయరత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


ప్రభుత్వ సర్క్యులర్ కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


ధర్నాలో పాల్గొన్న ఎంఎల్‌సి ఐవి, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు


కలెక్టరేట్‌లో ఎఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న మంత్రులు, అధికారులు

నిరాశ పరిచిన సిఎం పర్యటన

- జిల్లా సమస్యలను ప్రస్తావించని వైనం
- కాకినాడ సభలో ప్రసంగంపై అసంతృప్తి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడలో బుధవారం జరిగిన సిఎం పర్యటన ఉమ్మడి జిల్లా ప్రజలను నిరాశపరిచింది. ఎలాంటి హామీలు లేకుండా చప్పగా సాగింది. ప్రజా సమస్యలపై అసలు ప్రస్తావన రాలేదు. సమ్మెలో ఉన్న కార్మికుల ఊసే లేదు. కనీసం జిల్లా సమస్యలు, వాటికి పరిస్కార మార్గాలను కూడా జగన్ ప్రస్తావించలేదు. కేవలం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడానికే, ప్రతిపక్షాలను ఎండగట్టడానికే ఆయన ప్రసంగం పరిమితమైంది.

ఎన్నికలు మరో మూడు నెలలు మాత్రమే ఉన్నాయి. ఈ సారైనా జిల్లా ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తారని, వాటి పరిష్కారానికి మార్గం చూపుతారని అంతా ఆశించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని చాలా మంది అంచనా వేశారు. జిల్లా కేంద్రంలో సాగిన పర్యటన ద్వారా ప్రజా సమస్యలకు పెద్దపీట వేస్తారని అంచనాలు కూడా వినిపించాయి. కాని అవన్నీ ప్రస్తా వనకు రాలేదు. కేవలం 45 నిముషాల మాత్రమే ఆయన ప్రసంగించారు. పూర్తిగా వైసిపి పథకాల ప్రమోషన్‌కే ప్రాధాన్యతనిచ్చారు. కాకినాడ స్మార్ట్ సిటీ నిధులతో నిర్వహించిన పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులను ఇవ్వలేదు. ఈ నిధులు విడుదల అంశంపై ఆయన పెదవి విప్పలేదు. సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కాకినాడ ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ. 47 కోట్లు అడగగా దానికి మాత్రమే సిఎం సానుకూలంగా స్పందించారు. రోడ్లు అధ్వానంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ మాట పూర్తిగా మరిచారు. రెండేళ్ల క్రితం గొల్లప్రోలులో జరిగిన కాపు నేస్తం సభలో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీలకు రూ.40 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. నేటికి ఆ హామీ అమలు కాలేదు. పర్యాటక అభివృద్ధిపై గానీ, కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ పనులకు రాష్ట్ర వాటా నిధులు విడుదల అంశంపై గాని, సబ్ ప్లాన్ ఏరియా సమస్యలపై గానీ సీఎం నోరు మెదపలేదు.

పరిమితికి మించి జనం తరలింపు

పెన్షన్ పెంపు కార్యక్రమానికి కాకినాడ సిటీ నుంచి పరిమితికి మించి జనాన్ని తరలించారు. ప్రభుత్వ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాలు ఉద్యోగులు తెల్లవారుజాము నుంచే జనాన్ని తరలించే పనిలో నిమగ్నమయ్యారు. సభా ప్రాంగణంలోకి కిక్కిరిసి జనాన్ని పంపించగా అనేకమంది ఆర్ఎంసి గ్రౌండ్ బయటే ఉండిపోయారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున పోలీసులు ఎక్కడికక్కడ ఆంక్షలు కఠినతరం చేశారు. దాంతో అనేకమంది సీఎం రాకముందే ఇళ్లకు వెను తిరిగారు.

రూ.109 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

సభా వేదిక వద్ద కాకినాడ నగరంలో రూ.109 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి శిలాఫలకాలను సిఎం ఆవిష్కరించారు.. రూ.65 కోట్లతో నూతనంగా నిర్మించిన ముత్తా గోపాలకష్ణ వారధిని, వివేకానంద పార్కు ప్రాంగణంలో రూ.9.5 కోట్లతో నిర్మించిన స్కేటింగ్ రింక్‌ను, రూ.20 కోట్లతో నిర్మించిన కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. కాకినాడ జిజిహెచ్ ట్రామా కేర్ విభాగంలో రూ.7.20 కోట్ల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన కాథ్ లాబ్, ఐసియులను, రూ.7.50 కోట్ల నిధులతో కల్పించిన ట్రామా కేర్ వసతులను ఆయన ప్రారంభించారు.


కాకినాడలో సిఎం జగన్‌తో కె.రమణారావు

సిఎం జగన్‌ను కలిసిన 'గుడ్‌సీడ్ ఫౌండర్' రమణారావు

ప్రజాశక్తి-అమలాపురం

సిఎం వైఎస్.జగన్‌ను అమలాపురం నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ.3 వేలుకు పెంచిన సందర్భంగా బుధవారం కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ గ్రౌండ్స్ లో జరిగిన కార్యక్రమానికి వచ్చిన సిఎం జగన్‌ను కలిసి తాను వైసిపి ఆవిర్భావం నాటి నుంచి ఇప్పటివరకు పార్టీకి చేస్తున్న సేవలను వివరించానని రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన సిఎం జగన్ పార్టీకి చేసిన సేవలకు తప్పక గుర్తింపు ఉంటుందని, అలాగే కొనసాగించాలని సూచించారని రమణారావు తెలిపారు.

వైసిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలానికి చెందిన వైసిపి నాయకులు రేవు శ్రీనును పలువురు బుధవారం పరామర్శించారు. రేవు శ్రీను మాతృవియోగం జరిగింది. ఈ నేపథ్యంలో రేవు శ్రీనును మంత్రితోపాటు రామచంద్రపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, రాయపరెడ్డి రాజా, తదితరులను పరామర్శించారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం


అమలాపురంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద ఐద్వా నేతల నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

సంఘ సంస్కర్త, భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. బుధవారం ఆమె జయంతిని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.

అమలాపురం సావిత్రిబాయి పూలే మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఐద్వా నాయకులు అన్నారు. అమలాపురం బాలికల ఉన్నత పాఠశాల నందు సావిత్రిబాయి పూలే జయంతి ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నాగ వరలక్ష్మి, అధ్యక్షురాలు అమీదా, కష్ణకుమారి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** బాలుర వసతి గృహంలో బుధవారం టిడిపి, జనసేన శ్రేణులు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. **అంబాజీ పేట** సావిత్రిబాయి పూలే జయంతి అంబాజీపేట మండలం తొండవరం హైస్కూల్లో నిర్వహించారు. మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సిఎంఒ బివి.సుబ్రహ్మణ్యం అన్నారు. మహిళా ఉపాధ్యాయురాలు కొంపెల్ల వాణీని సత్కరించారు. రాష్ట్రస్థాయి విద్య ప్రజ్ఞానిక ప్రదర్శనలో పోస్టర్ ప్రజెంటేషన్ అంశంలో ఎంపికైన ములపర్తి నమితకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సిఎంఒ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం పివి.కేశచార్యులు, ఉపాధ్యాయులు మట్టపర్తి రాంబాబ్,బి. రామాంజనేయరావు, ఎం. చంద్రావు, పాటి వెంకటేశ్వరరావు, పిల్లి త్రిమూర్తులు, ముషిని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** మండలంలోని సందిపూడిలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ తోట భవాని, వెంకటేశ్వర్లు ఎంపిటిసిసభ్యుడు తోలేటి సంతోషి అంజిబాబు తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్నురపురెడ్డి గోపాలకష్ణ , బ్రహ్మజీ, సొసైటీ చైర్మన్ మోటుపల్లి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ గుత్తుల శ్రీనివాస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు. సావిత్రిభాయి పూలే జయంతిని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయినిలను ఎస్‌టియు ఆలమూరు మండల శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. **మండపేట** స్థానిక సంగమేశ్వర కాలనీలో ఎంపిపి పాఠశాల్లో ప్రధానోపాధ్యాయురాలు ముత్యాల మాణిక్యాంబ విద్యార్థులతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు. ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** ద్రాక్షారామ మసీద్ సెంటర్ లో ఉన్న పూలే దంపతులు విగ్రహాలకు మైనారిటీ బిసి సేన నాయకులు యాట్ల నాగేశ్వర రావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.తదుపరి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాగేశ్వర రావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళల విద్యాభివద్ధికి ఎనలేని కషిచేశారన్నారు.కార్యక్రమంలో వీరభద్రరావు, విజయ్ కుమార్, రామకష్ణ, సుబ్బారావు, అప్పారావు,గంగాధర్, రత్నరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పట్టణం లో జరిగిన కార్యక్రమంలో వికాస్ కాలేజీ వద్ద సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** నగర పంచాయతీ పరిధిలో స్థానిక తిల్లమ్మ చెరువు ప్రాథమిక పాఠశాల్లో పీపుల్ సర్వేస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నిడి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో సావిత్రి భాయ్ పూలే జయంతి నిర్వహించారు. 25 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, బి.శరత్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు


అంబాజీపేట మండలం తొండవరం హైస్కూల్లో సావిత్రి బాయి పూలే జయంతి


మండపేటలో సావిత్రిబాయి పూలే జయంతి


ద్రాక్షారామలో పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులు


ఆలమూరు మండలం సంధిపూడిలో పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

అన్నదాన భవనానికి రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి బుధవారం వాడపల్లి వెంకటేశ్వర వాసవి నిత్యాన్నదాన ట్రస్ట్ తరపున చైర్మన్ శిఖాకొళపు శివ రామ సుబ్రహ్మణ్యం రూ.10 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాత ఈ విరాళాన్ని ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ సత్యనారాయణ రాజులకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ప్రజాప్రతినిధులు, అధికారులతో బోస్ సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గం లో గల రామచంద్రపురం, కె.గంగవరం , కాజులూరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులకు ,అధికారులకు గురువారం రాజ్యసభ సభ్యులు వైసిపి నాయకులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేనికి మండలాధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఎంపిడిఒ కీర్తి స్పందన బుధవారంఒక ప్రకటనలో తెలిపారు


ఇప్పనపాడులో పాల్గొన్న ఎంఎల్ఎ వేగుళ్ల

రెండు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-యంత్రాంగం

బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం రెండు గ్రామాల్లో బుధవారం జరిగింది. **మండపేట** ఇప్పనపాడు గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో సర్పంచ్ కుంచే వీరమణి దుర్గాప్రసాద్, టిడిపి, జనసేన పార్టీ నాయకులతో కలసి పాల్గొన్న ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఇంటింటికి వెళ్లి టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు కలిగే లబ్ధిని వివరించారు. టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆలమూరు** మండలంలోని సంధిపూడిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ మరియు రచ్చబండలి కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు, సర్పంచ్ తోట భవాని, ఎంపిటిసి సభ్యులు తోలేటి అంజిసంతోషి, ఆలమూరు మండల మరియు సంధిపూడి గ్రామ టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



ఇసుక అక్రమ రవాణా

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ -2024 కార్యక్రమం ద్వారా స్వచ్ఛమైన, దోష రహిత జాబితాల రూపకల్పనకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని జిల్లా కలెక్టర్ హి మాన్షు శుక్లా కోరారు.బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితాల సవరణ -2024 అంశాలపై వారాంతపు సమావేశం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతివారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఓటరు జాబితా సవరణకు సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపు, అభ్యంతరాల కొరకు అందిన ధరఖాస్తుల పరిష్కార ప్రగతిని వివరించారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను అడిగి తెలుసుకుని ఆయన ఈ సందర్భంగా నివత్తి చేశారు గత ఏడాది అక్టోబర్ 27 నుంచి డిసెంబర్09 వరకు ముసాయిదా జాబితాలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సేకరించడం జరిగిందని, అందిన దరఖాస్తులపై పరిష్కారం పూర్తిచేసి, సవరించిన షెడ్యూల్ ప్రకారం 2024 జనవరి 22 న తుది ఓటరు జాబితా ప్రచురణ కొరకు సర్వసన్నద్ధం అవుతున్నామన్నారు. జిల్లాలో ఉన్న 1,644 పోలింగ్ కేంద్రాల్లో రన్నింగ్ వాటర్తో మరుగుదొడ్లు, వికలాంగుల సౌకర్యార్థం ర్యాంపులు, లైట్లు వంటి కనీస వసతులు ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, వైసిపి తరపున షేక్ అబ్దుల్ ఖాదర్, టిడిపి తరపున అల్లాడి స్వామి నాయుడు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున కామన ప్రభాకరరావు, వడ్డీ నాగేశ్వరరావు, బిజెపి తరపున దూలం రాజేష్, సిపిఎం తరపున కారెం వెంకటేశ్వరరావు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుకు డిమాండ్

ఆలమూరు న్యాయవాదుల రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి-ఆలమూరు

సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఎపి ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని ఆలమూరు బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ఆవరణమునందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం హడావుడిగా ప్రవేశపెట్టిన ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 27-2023 రద్దు చేయాలన్నారు. ఈ యాక్టు రద్దు చేసేవరకు ప్రజలు, రైతుల పక్షాన న్యాయవాదులు పోరాటాలు చేస్తామన్నారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ల్యాండ్ టైట్లింగ్ చట్టం వలన ప్రజలకు జరిగే నష్టాల్ని వివరిస్తామన్నారు. ఈ యాక్టు వలన ప్రజలకు ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్‌విఎస్‌విఎన్.మూర్తి, సెక్రెటరీ ఎం. మహేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ జి.రాజశేఖర్, ట్రెజరర్ బి.విద్యా ప్రసన్న, విత్తన సత్యనారాయణ, కప్పల సునీల్ కుమార్, జొన్నపల్లి సత్యనారాయణ, టివి.గోవిందు రాజు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో ఆలమూరు న్యాయవాదులు

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రేమించిన యువతి దక్కలేదని మనస్తాపానికి గురై ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇవి. పేదరామల్లికి చెందిన మందా అనిల్ కుమార్ (22) కాకినాడలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రేమించిన యువతి బుధవారం పెళ్లి జరుగుతుండడంతో అనిల్ కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. అనిల్ కుమార్ బుధవారం తెల్లారేసరికి ఇంటి మెట్ల ఇనుప చువ్వకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. మతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసుదర్యాప్తు జరుగుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-మండపేట

మారేడుబాక గ్రామానికి చెందిన పుట్టా శ్రీనివాసరావు రెండు రోజుల క్రితం 15 మద్యం సీసాలు తరలిస్తుండగా అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. రాబోయే జనరల్ ఎలక్షన్ సందర్భంగా ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుని రౌడీషీట్లు తీరుస్తానని పట్టణ సిఐఎ.అఖిల్ జమా అన్నారు.

సారా స్వాధీనం : నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్ఇబి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం లంపకలోవలో పది లీటర్లు సారా స్వాధీనం చేసుకుని ఒక మహిళను, గొనాడలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని, కత్తిపూడిలో 30 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని, పది లీటర్ల సారాతో మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కొంతంగి, కొత్తూరులో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున బెల్లపు ఊటను ధ్వంసం చేసి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.సునీల్‌కుమార్, బి.శ్రీనివాసరావు, కె.గిరిధర్ సిబ్బంది ఉన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అనంతపల్లి గ్రామంలో దాడి చేసి ఒక వ్యక్తి దగ్గర ఉన్న 16 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి సిఐ డి.సుధ తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో దాడి చేసి గ్రామానికి చెందిన సుంకర కిరణ్‌కుమార్ ఇంటిపై దాడి చేసి విక్రయాలకు ఉంచిన సారాను స్వాధీనం చేసుకుని, విక్రయదారుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ పి.సుధీర్, సిబబంది బి.వెంకన్నబాబు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఉన్నగట్ల గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాయుడు కోటేశ్వరరావు కిల్లీ సాపులో నిల్వ చేసిన 6 బీరులను, అలాగే బొల్ల వరలక్ష్మి దుకాణంలో ఉన్న 5 క్వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, వారిద్దరినీ అరెస్టు చేసినట్లు ఎస్ఐ సిహెచ్.రమేష్ తెలిపారు. మండలంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం, సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని తొక్కిరెడ్డిగూడెం గ్రామంలో దాడులు నిర్వహించి 40 లీటర్ల నాటు సారా, 20 మద్యం బాటిల్స్ కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో తొక్కిరెడ్డిగూడెం గ్రామంలోని మాన్యం సత్యనారాయణ ఇంటిపై దాడి చేయగా, ఆ ఇంటిలో 40 లీటర్ల నాటు సారా, 20 మద్యం బాటిల్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో ముద్దాయిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నల్లజర్ల

సంక్రాంతి పండుగ పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఖఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ వి.కిషోర్ కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేక రులతో మాట్లాడారు. జూదంతో కూడిన కోడి పందాలు, గుండాటలు, కోసాటలు, పేకా టలు, ఇతర మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలకు సంబంధించి బరులను ఏర్పాటు చేస్తే తక్షణమే వాటిని ధ్వంసం చేసి సంబం ధిత భూ యజమానులపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

'వైఎస్ఆర్ పింఛను కానుక' ఒక మైలురాయి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

నవరత్నాల కార్యక్రమాలలో వైఎస్ఆర్ పింఛను కానుక పథకం ఒక మైలురాయి అనిజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల బహిరంగ సభ నుండి పెంచిన పింఛన్ నిధులను సిఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారులకు వర్చువల్ విధానంలో జమ చేశారన్నారు. ఈ వర్చువల్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ పింఛన్ కానుక పథకం సమాజంలోని అత్యంత అట్టడుగు వర్గాలను ఆదుకోవడానికి ఉద్దేశం పబడిందన్నారు. పేదరిక వర్గాలలో వద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళ వితంతువులు చేనేత కల్లుగీత కార్మికులు మత్స్య కారులు చర్మకారులు, చేతి వత్తులవారికి సామాజిక భద్రత, సురక్షితమైన గౌరవప్రదమైన జీవనాన్ని అందించే ఉద్దేశ్యంతో పింఛను దశల వారీగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జనవరి ఒకటో తేదీ నుంచి 2,48,514 మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ. రూ.72,38,64,000 చెల్లిస్తుండగా జనవరి నెల నుంచి ఈ పెంపుదల మూలంగా రూ.5.92 కోట్లు మేర లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ మెగా చెక్కును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు పెంచిన రూ.3వేల పెన్షన్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈనెల ఒకటో తేదీ నుంచి వైఎస్ఆర్ పింఛను కానుక రూ.3 వేలకు పెంపు, 8వతేదీ వరకు పండుగలా పింఛన్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. .ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు పికె.రావు, జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ పథక సంచాలకులు వి.శివశంకర్ ప్రసాద్, ఎపి డిఎం ఎం.జిలాని, డిపిఎం విజయ్ కుమార్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పోర్లు దండాలతో కార్మికుల నిరసన



ముమ్మిడివరంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె చేపట్టారు. బుధవారం 9వ రోజుకు చేరింది. **మండపేట** వారి సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల పొర్లుదండాలు పెడుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి నాటికి 9వ రోజుకు చేరుకుంది. కార్మిక నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వంతో కార్మిక సంఘ నాయకులు డిమాండ్ల పరిష్కారానికి చర్చలు జరిపినా అవి విఫలమయ్యాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు ప్రభుత్వం పెంచాలన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కొమరపు నరేంద్ర కుమార్, బంగారు కొండ, లోవరాజు, విజయ్, సవరపు సరోజినీ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, సుప్రీమ్ కోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 9 రోజుకు చేరింది. సావిత్రి భాయ్ పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు.అనంతరం చిత్రపటానికి వినతిపత్రం అందించి సమ్మెలో పాల్గొన్న కార్మికులకు సంఘీభావం తెలిపారు.



మండపేటలో పొర్లు దండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు



రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల నిరసన

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, శీలం వెంకటేశ్వరరావు, జనిపల్లి సత్యనారాయణలు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు ఎస్.అరుణ్ కుమార్, నక్కా అరుణ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, రామరాజు, ఈశ్వర్ గోవింద్, ఈశ్వర్ నాథ్, నిమ్మకాయల వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** సమ్మెలో రామచంద్రపురం ఎపి మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులందరూ బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ధర్నా చేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పి.రాము, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మీసాల గోపి, వడ్డాది సతీష్ కుమార్, యనమదల శీను, మాడుగుల శీను, ఎన్.వీర వెంకట సత్యనారాయణ, సింగంపల్లి అనిల్ మరియు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

యానాంలో కేంద్ర మంత్రుల పర్యటన

ప్రజాశక్తి - యానాం

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తమ్ రూపాల, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ బుధవారం యానాంలో పర్యటించారు. తొలుత స్థానిక అతిథి గహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి కేంద్ర మంత్రులకు ఘనస్వాగతం పలికారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా స్థానిక సావిత్రి నగర్, గిరియంపేట ఫిషింగ్ హార్బర్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మత్స్యశాఖ అధికారులు వారిని ఘనంగా సత్కరించారు. కేంద్ర మంత్రులు మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రమంత్రి పరిషోత్తం రూపాల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మత్స్యశాఖ జాయింట్ సెక్రెటరీ నీతూ కుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం అవగాహన చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు కేంద్ర మంత్రులకు వివరించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఒఎన్‌జిసి నష్టపరిహారం కూడా త్వరలో అందజేస్తామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.గొంతియ్య, మత్స్యకార నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఆసుపత్రి సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వాసుపత్రిలో ఔట్సోర్సింగ్‌లో పని చేస్తున్న 42 మంది సిబ్బందికి 46 నెలలగా ప్రభుత్వం జీతాలు అందించక పోవడంతో బుధవారం ఉదయం ఆందోళన చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో నినాదాలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో 46 నెలలుగా వేతనాలు అందించక పోవడంతో అనేకపరమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూన్నామని, తమ పిల్లలకు స్కూల్ పీజులు కట్టక పాఠశాలలో బయటకు పంపిస్తున్నారని, అద్దె ఇళ్లలో నుంచి రోడ్డు మీదకు పంపేస్తున్నారని, పండుగ పూట పస్తులు ఉంటున్నామని అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ విధులకు ఆటంకం కలిగించకుండా కరోనా సమయంలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి పని చేసామని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. తక్షణమే తమకు వేతనాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అందోళన చేశారు. వీరికి పలువురు సంఘీభావం తెలిపారు.

మెరుగైన వైద్య చికిత్సతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మతి స్థిమితం (మానసిక స్థితి) సక్రమంగా లేక బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దవచ్చునని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అన్నారు.

ఐ .పోలవరం మండలం మురమళ్ళ కు చెందిన చెయ్యేటి వెంకట్రావ్ మానసిక స్థితి సక్రమంగా లేక పిచ్చి వానిగా ప్రవర్తిస్తూ కుటుంబ సభ్యులు,చుట్టుపక్కల వారితో నిత్యం గొడవలు పడేవాడు. అంతే కాకుండా మహిళలు, స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు, వాహన దారులను రాళ్లతో కొడుతూ ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈ విషయం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ దృష్టికి వచ్చింది. ఛైర్మన్ తక్షణమే స్పందించి, మతి స్థిమితం లేని వ్యక్తులను పోలీసుల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా ఆదేశించారు. వైద్యులు పరీక్షించి వారి మానసిక స్థితి దృష్ట్యా వారిని విశాఖలోని మెంటల్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకున్నారు.

చికిత్స అనంతరం వెంకట్రావ్ పూర్తిగా కోలుకున్నట్లు నిర్ధారించి ఆసుపత్రి నుంచి విడుదల చేశారు. డిశ్చార్జ్ అయిన వెంకట్రావు ను బుధవారం లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎదుట ప్రవేశ పెట్టి వైద్య నివేదికను మెజిస్ట్రేట్ రహంతుల్లాకు అందజేశారు. అనంతరం సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయిన వెంకట్రవ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మత్స్యకారుల స్థితిగతుల్లో మార్పునకు కృషి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మత్స్యకారుల ఆర్థిక, జీవన స్థితిగతుల్లో మార్పు తీసుకురావడంతో పాటు కోస్తా తీర ప్రాంత అభివద్ధికి భారత ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలా అన్నారు. భారత ప్రభుత్వ మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ నేతత్వంలో నిర్వహిస్తున్న సాగర్ పరిక్రమ ఫేజ్-10 కార్యక్రమం బుధవారం జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ఫిషింగ్ హార్బర్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్, కేంద్ర జాయింట్ సెక్రెటరీ నీతూ ప్రసాద్, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, యానాం ఎంఎల్ఎ జి.అశోక్, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులకు మెగా చెక్కులను, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ)లను, వాహనాలను పంపిణీ చేశారు.

కోస్తా తీర ప్రాంతాలను అభివద్ధి చేయాలనే లక్ష్యంతోనే సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా దేశంలోని మత్స్యకార ప్రాంతాలను పర్యటిస్తూ, మత్స్యకారులతో మమేకం అవుతున్నట్లు కేంద్ర మంత్రి రూపాలా అన్నారు. కాకినాడ పోర్టు ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను అధ్యయనం చేసి అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద 'పోరుబాట'



కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అమలాపురం

ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ నాయకులు కలెక్టరేట్ వద్ద బుధవారం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు 12 గంటల పాటు ధర్నా, వంటవార్పు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పాదయాత్రలో అప్పటి ప్రతి పక్ష నేతగా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా సిపిఎస్ రద్దు చేస్తానని, మెరుగైన పిఆర్‌సి ఇస్తానని సకాలంలో డిఎ చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇందులో ఏ ఒక్కటి నెరవేర్చకపోగా కనీసం ఒకటవ తేదీకి జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. వివిధ అవసరాల కోసం ఉద్యోగ ఉపాధ్యాయుల దాచుకున్న పిఎఫ్, ఎపిజి ఎల్ఐ సరెండర్ లీవ్ చెల్లింపులు కూడా చేయడం లేదు. పిఆర్‌సి, డిఎ ఎరియర్లు ఊసే లేదన్నారు. రిటైరైన ఉద్యోగ ఉపాధ్యాయుల రెటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా అందడం లేదన్నారు. ఈ 12 గంటల పాటు నిరంతర ధర్నా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం చేస్తున్న దగా గురించి పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివి.సుబ్బారావు, జిల్లా కార్యదర్శులు, జిల్లా నాయకులు, ప్రతిపక్ష నాయకులు ఎ.ఆనందరావు, కె. ప్రభాకర్ రావు , సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కష్ణవేణి మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పై డిమాండ్లు నెరవేర్చని పక్షంలో మూడవ దశ పోరాటంలో భాగంగా జనవరి 9, 10 తేదీలలో 36 గంటల పాటు నిరంతర ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు కాగడాలతో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేశారు. రాత్రి 9 గంటల వరకు వంట వార్పుతో ఉపాధ్యాయులు తమ నిరసన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

వేగాయమ్మ పేటలో కళ్యాణ మండపానికి భూమి పూజ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని వేగాయమ్మపేట గ్రామంలో రూ 25 లక్షలతో నిర్మించే శెట్టిబలిజ సంఘం కళ్యాణమండపం ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆయన తనయుడు వైసిపి ఇంఛార్జ్ పిల్లి సూర్యప్రకాశ్‌లు బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి తుకారాం, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు ఇంత సంతోషం, బీసీ సంఘం నాయకులు దొంగల శ్రీధర్, గెద్దాడ సుబ్రహ్మణ్యం, జుత్తుగ శ్యాం ప్రసాద్, వాసంశెట్టి బాల, న్యాయవాది డి.సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీ బోస్, కుమారుడు పిల్లి సూర్యప్రకాష్

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వేతన సవరణ చర్చలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసి ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. భోజన విరామ సమయంలో బుధవారం డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన కార్యమ్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మెండు కోదండరామ్ మాట్లాడుతూ గత 18 నెలలుగా బకాయి ఉన్న వేతన సవరణ, సిబ్బంది నియామకాలు తదితర సమస్యలపై వెంటనే చర్చలకు యూనియన్‌లను పిలవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఒక గంటపాటు సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పి.సతీష్, ప్రసాద్, అశోక్, షఫీ పాల్గొన్నారు.

ఉప్పాడ ఎండు చేపలకు గిరాకీ

ప్లాట్ ఫారాలు లేక మత్స్యకారుల అవస్థలు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

ఉప్పాడ సముద్ర తీరం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటూ పర్యాటకుల ఆకర్షిస్తూ ఉంటుంది. అలాగే ఉప్పాడ పట్టు చీరలు, కజ్జికాయలు ఉప్పాడకు ఫేమస్. అదే కాకుండా ఉప్పాడలో ఎండబెట్టిన ఎండు చేపలుకు మంచి గిరాకీ ఉంటుంది. ఉప్పాడ ఎండు చేపలు నక్కపల్లి, రాజమహేంద్రవరం, ఒంగోలు, హైదరాబాద్, రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా తరలి వెళ్తాయి. ఉప్పాడ ఎండు చేప తిన్నారంటే ఆ రుచి మర్చిపోలేరు. అలాంటి ఎండు చేపల తయారీకి ప్లాట్ ఫారాలు లేక మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఉప్పాడ ఎండు చేప అంటే ఎంతో గిరాకీ ఉంటుంది. అటు వంటి చేపలను ఆరబెట్టే మత్స్యకార మహిళలకు ఈరోజు కష్టాలు మొదలయ్యాయి. చేపలు ఆరబెట్టేందుకు ప్లాట్ ఫారాలు లేక చాలా అవస్థలు పడుతున్నామని మత్స్యకార మహిళలు చెబుతున్నారు. కర్రల పందిళ్లు ఏర్పాటు చేసి వాటిమీద గాలిలో చేపలు ఆరబెడుతున్నామని తెలుపుతున్నారు. వీటి వల్ల కూడా ఎండు చేప మంచి రుచిగా ఉంటుందని చెబుతున్నారు. అయినప్పటికీ కొన్ని చేపలు ఆరబోసేందుకు ప్లాట్ ఫారాలు నిర్మించాలని, ఒకపక్క సముద్రం వల్ల తీర ప్రాంతమంతా కోతకు గురవుతోందని వాపోతున్నారు. దీనివల్ల తమ జీవనోపాధికి చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం గాలిలో కర్రలపై ఆరబెడుతున్న సావిడెం చేప ఇతర రాష్ట్రాలకు తరలిస్తామని తెలియజేస్తున్నారు. తీర ప్రాంతంలో ఎండు చేప ఆరబెట్టేందుకు వసతులు కల్పిస్తే ఎక్కువ శాతం ఎండు చేప తయారు చేసేందుకు వీలుంటుందని మత్స్యకార మహిళలు కోరుతున్నారు. నాయకులు, అధికారులు ఎండు చేపల తయారీకి వసతులు కల్పించి సహకరించాలని కోరుతున్నారు.



ఎండిన చేపలను శుభ్రం చేస్తున్న మత్స్యకార మహిళలు



వెదురులపై ఆరబెట్టిన ఎండు చేపలు